సాక్షి
వనపర్తి
మంగళవారం । 17 । జనవరి । 2023



కల్యాణం.. కమనీయం
భోగమహేశ్వరంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.
వివరాలు 8లో ▸



టోల్ సిబ్బంది దాడి
167వ హైవేపై టోల్ సిబ్బంది వినియోగ దారులపై దురుసుగా ప్రవర్తించారు.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 32.3/16.2
వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మలంగా, ఎండగా ఉంటుంది. ఉదయం, రాత్రికి చలిగాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓగా శ్రావణ్

వనపర్తి: ప్రస్తుత జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్‌రెడ్డి డిప్యూటేషన్‌పై హెచ్ఎండీఏకు వెళ్లారు. సోమవారం జిల్లా నుంచి రిలీవ్ అయ్యా రు. దీంతో జిల్లాకు నూతన జెడ్పీ సీఈఓగా వెయింటింగ్‌లో ఉన్న శ్రావణ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జిల్లాలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చే వరకు డిప్యూటీ సీఈఓ రామేశ్వర్‌రెడ్డికి ఎఫ్ఏసీ బాధ్యతలు చేపట్టారు. జిల్లా నుంచి రిలీవ్ అయిన వెంకట్‌రెడ్డిని కార్యాలయం ఉద్యోగులు శాలువాతో సత్కరించారు.

సభ్యత్వ నమోదులో కృషి ప్రశంసనీయం

వనపర్తి: రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు విషయంలో ఆయా శాఖల జిల్లా అధికారుల కృషి ప్రశంసనీయమని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఆయాశాఖల అధికారులు సమకూర్చిన సభ్యత్వాల రసీదులు, డబ్బులను తన సమక్షంలో రెడ్‌క్రాస్ చైర్మన్ ఖాజా ఖుతుబుద్దిన్‌కు అందజేశారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 617 సభ్యత్వాలకు సంబంధించి రూ.7లక్షలు జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే వనపర్తి జిల్లానుంచి అత్యధిక సభ్యత్వాలను నమోదు చేయించినట్లు తెలిపారు. ఇందులో రూ.25వేల సభ్యత్వాలు మూడు, రూ.12 వేల సభ్యత్వం ఒకటి, మిగతా 613 సభ్యత్వాలు రూ.వెయ్యికి సంబంధించినవి ఉన్నట్లు తెలిపారు.

జిల్లాకు ఉపాధి హామీ నిధులు మంజూరు

వనపర్తి: ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో జిల్లాలోని 14 మండలాల్లో 404 సీసీ (సిమెంట్ కాంక్రీట్) రోడ్ల నిర్మాణానికి రూ.17.42 కోట్లు, 93 నూతన గ్రామ పంచాయతీల నిర్మాణానికి రూ.18.60 కోట్లు విడుదల చేస్తూ ఈనెల 13న కలెక్టర్ షేక్ యాస్మిన్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మెటీరియల్ కాంపోనెంట్ విభాగంలో చేయాల్సిన పనులను ప్రాధాన్యత క్రమంలో ప్రజాప్రతినిధుల సూచన మేరకు ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కావాల్సిన చోట గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి నిధుల కేటాయింపులు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడిచాయి.

మంత్రి చొరవతోనే జిల్లా అభివృద్ధి..
వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చొరవతోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా వనపర్తి నియోజకవర్గం, జిల్లా అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. సీసీ రోడ్లు, జీపీ భవనాల నిర్మాణానికి నిధుల కేటాయింపు సందర్భంగా సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ బి.లక్ష్మయ్య, మార్కెట్ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, రాజనగరం సింగిల్ విండో అధ్యక్షులు విజయ్, నాయకులు కురుమూర్తి యాదవ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా వ్యవహరించాలి

పాన్‌గల్: పండుగలను శాంతియుతంగా జరుపుకుంటూ ఆదర్శంగా నిలువాలని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో బొల్లి గట్టు ఆలయ ఉత్సవాల ఎద్దుల బండ్ల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మన సంస్కృతీ, సంప్రదాయాలు తెలియపర్చే సంక్రాంతి సంబరాలను గ్రామీణులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడం సంతోషకరమన్నారు. స్థానిక సర్పంచ్ సింధూజ, దేవేందర్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, వాల్మీకి నాయుడు పాల్గొన్నారు.

నిషేధం ఉత్తిమాటేనా?



వనపర్తిలో కొన్నేళ్ల కిందట ప్లాస్టిక్ కవర్‌లను పుర ట్రాక్టర్‌లో వేసుకొని వెళ్తున్న దృశ్యం (ఫైల్)

- పర్యావరణానికి ముప్పుగా మారిన ప్లాస్టిక్
- వినియోగిస్తే రూ.2,500 నుంచి రూ.5వేల వరకు జరిమానా
- మున్సిపాలిటీలో నిషేధం అమలు అంతంతే..

వార్డులు 33	
జనాభా	నివాసాలు, దుకాణాలు
70,416	16వేల 500

వనపర్తి టౌన్: పర్యావరణానికి అవరోధం కలిగిస్తున్న ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకారిగా మారుతోంది. ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి పదార్థాలను ఆరగిస్తే క్యాన్సర్ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంతటి ప్రమాదకరమైన ప్లాస్టిక్ వినియోగం వనపర్తిలో అత్యధికంగా ఉంది. వీటికి అడ్డుకట్ట వేయాలని పాలకులు, అధికారులు చెబుతున్నా ఆచరణలో అడుగు ముందుకు పడటంలేదు. బయట మార్కెట్‌లో, ఏ దుకాణానికి వెళ్లినా ఆకుకూరల నుంచి మొదలు ఏ వస్తువు కొన్నా ప్లాస్టిక్ కవర్‌లో ఇవ్వడం పరిపాటిగా మారింది.

వీడాలి నిర్లక్ష్యం..
ప్లాస్టిక్ నిషేధంపై అధికార యంత్రాగం చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం విధించాలని 2017 అక్టోబర్ నుంచి చెబుతున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకావడం లేదు. ప్రచారం పేరున ప్రజాధనం ఖర్చు చేస్తున్నా కార్యాచరణకు నోచుకోవడం లేదు. తాజాగా 2023 జనవరి 1నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. ఈసారైనా అమలవుతుందో లేదో వేచి చూడాలి.

అటకెక్కిన నిషేధం..
పర్యావరణాన్ని పెను ప్రమాదకారమైన ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లో నిషేధించారు. ఈ చట్టం ప్రకారం దుకాణాదారులు ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు అమ్మితే రూ.2,500 నుంచి రూ. 5వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. తయారీ దారులకు రూ. 25వేల నుంచి రూ.50వేల వరకు విధించవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో 25, 128 జీవోలను విడుదల చేసింది. 40 మైక్రాన్ల మందంతో పాటు అడ్డం 8ఇంచులు, పొడవు 12 ఇంచులు, పరిమాణం కంటే తక్కువగా ఉన్న కవర్‌లు వాడకాన్ని నిషేధించింది. ఉత్పత్తులు కూడా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్ నిబంధనల ప్రకారం తయారు చేయాలి. నిషేధిత కవర్‌లు వాడటంతో కలిగే దుష్పరిణామాలను కరపత్రాలు, టీవీలు, సినిమా హాల్‌లలో, వీధిల్లో గోడలపై ప్రదర్శించి అదుపు చేయాలి. ప్రజలు ప్లాస్టిక్ కవర్‌లను వాడకుండ కాటన్, జనపనారతో తయారు చేసి ఉత్పత్తులను వాడేలా అవగాహన సైతం కల్పించాలి.

అమలు అంతంతే?

జిల్లాలోని వనపర్తి మున్సిపాలిటీ, పెబ్బేరు, కొత్తకోట, అమరచింత, ఆత్మకూర్ మున్సిపాలిటీలతో పాటు ప్రధాన మండల్లాలోనూ ప్లాస్టిక్ నిషేధంపై అంతగా అధికారులు స్పందించట్లేదు. వనపర్తి మున్సిపాలిటీలో కొన్నేళ్ల కిందట అప్పటి కమిషనర్, తహసీల్దార్‌లు ప్లాస్టిక్ నిషేధానికి పూనుకున్నప్పటికీ రాజకీయ జోక్యంతో మధ్యలోనే నిలిచిపోయింది. తర్వాత నేటికీ తరచూ ఒకట్రెండు రోజులు హడావుడి చేసి మరిచి పోతుండటంతో ప్లాస్టిక్ నిషేధం అమలు కావడంలేదు.

తనిఖీలు చేస్తాం..



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నాం. అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు స్థానిక సంస్థల అధికారులను అప్రమత్తం చేస్తాం. ఇప్పటికే వనపర్తి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం వల్ల కలిగే అనర్థాలను వ్యాపారులకు వివరించాం. – ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్

ప్రజలు సహకరించాలి..



ప్లాస్టిక్ నిషేధం అమలుకు అధికారులు ప్రజలను చైతన్యవంతులుగా చేయాలి. మా వద్దకు వచ్చినప్పుడు కవర్‌లు ఇవ్వకపోతే వ్యాపారం సాగదు. ఎవరితోనైనా కవర్ కనబడితే అధికారులు లాక్కోవాలి. అప్పుడే ప్రజలు భయపడి వ్యాపారులను కవర్‌లు అడిగేందుకు ధైర్యం చేయరు.
– వాసు, వ్యాపారి వనపర్తి

దోమల వ్యాప్తికి కారణం..



ప్లాస్టిక్ కవర్‌లు వాడకం వల్ల తీవ్ర అనర్థాలున్నాయి. డ్రైనేజీల్లో కవర్‌లు అడ్డంగా ఇరుక్కుపోయి మురుగునీరు ప్రవహించకుండా నిలువరిస్తాయి. తద్వారా దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా ప్రజలకు జ్వరం, డెంగీ, మల్లేరియా తదితర వ్యాధులు వస్తాయి. ప్లాస్టిక్ నిషేధిస్తే పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసినట్లవుతుంది. – మరిమళ, ప్రభుత్వ వైద్యురాలు

భూగర్భ జలాలకు ఇబ్బంది



ప్లాస్టిక్ వాడకంతో భూగర్భజలాలు భూమిలోకి తొందరగా ఇంకిపోలేవు. తద్వార నీటి కష్టాలు తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రజలు ప్లాస్టిక్ కవర్‌లను ఎక్కడపడితే అక్కడ పారవేయడం వల్ల భూమిలోకి అవి కరిగేందుకు వేలాది సంవత్సరాలు పడుతుంది. భవిష్యత్‌లో నీటి కష్టాలతో ప్రజలు ఇబ్బందులు పడేందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్లాస్టిక్ వినియోగం ఒక కారణం అని గ్రహించాలి.
– దానయ్య, డీఈ, ఆర్అండ్‌బీ

అన్నిరంగాల్లో జిల్లా ముందంజ



రన్నర్ జట్టుకు రూ.75వేల నగదు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీలు

- ముగిసిన సింగిరెడ్డి తారకమ్మ స్మారక క్రికెట్ టోర్నీ
- విజేతగా బీఆర్ఎస్, రన్నర్‌గా ఆర్‌సీసీ జట్లు
- బహుమతులు అందజేసిన కలెక్టర్, ఎస్పీ

వనపర్తి క్రైం: క్రీడలతోపాటు అన్ని రంగాల్లో వనపర్తి జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో సింగిరెడ్డి తారకమ్మ స్మారక జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆమె ఎస్పీ అపూర్వరావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత మూడేళ్లలో వనపర్తి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, మెడికల్, ఫిషరీస్, నర్సింగ్, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసి చదువుకు ప్రాముఖ్యత ఇస్తున్నట్లు తెలిపారు. మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ జిల్లాలో జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంటు పెద్దఎత్తున నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

విజేతగా బీఆర్ఎస్ జట్టు..
పోటీల్లో బీఆర్ఎస్–ఆర్‌సీసీ టీంలు ఫైనల్‌కు చేరాయి. మొదట ఆర్‌సీసీ టీం క్లబ్ 15 ఓవర్లలో 82 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన బీఆర్ఎస్ 12 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి విజేతగా నిలిచింది. దీంతో విజేత జట్టుకు రూ.1.50లక్షలు, రన్నర్ జట్టుకు రూ.75వేలు కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ అపూర్వరరావు, సింగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రత్యూష రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మొదట మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ రాజ్‌కు రూ.10వేలు, బెస్ట్ బౌలర్‌గా నిలిచిన శివకు రూ.10వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్గనైజర్స్ మహేష్, సూగురు గిరి, హేమంత్, ప్రశాంత్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటీశ్రీధర్, మార్కెట్ యార్డు చైర్మన్ రమేష్ గౌడ్, వరప్రసాద్, సల్మాన్, ఆసీఫ్, కోచ్ సురేష్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి నిరంతర సహకారం



మరమ్మతుల గురించి తెలుసుకుంటున్న దేశాయి ప్రకాష్ రెడ్డి

అమరచింత: ప్రజలకు విద్య, వైద్యసేవలు సకాలంలో అందించాలన్న సంకల్పంతో పట్టణంలో డీఎంఆర్ఎం ట్రస్టుద్వారా పాఠశాల, వైద్యశాలను నిర్మించామని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, వైద్యశాలలలో డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా చేపడుతున్న పేయింటింగ్ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, రెడ్‌క్రాస్ మండల కార్యదర్శి శ్యామ్, వినోద్, రఫీ, ఆశీర్వాదం, పలువురు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

వనపర్తి: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ సూచించారు. సోమవారం నూతన సమీకృత కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం భోజన విరామం వరకు కొనసాగిన ప్రజావాణికి కేవలం 6అర్జీలు అందాయని గ్రీవెన్స్ సెల్ అధికారి శ్రీకాంత్‌రావు తెలిపారు. అందులో రెండు ఆసరా పెన్షన్ల మంజూరు కోసం, మరో నాలుగు ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ అందజేసినట్లు తెలిపారు.

ఏడాది నుంచి కూలి ఇవ్వటం లేదు
గత ఏడాది వేసవిలో ఫారెస్టులో పనిచేసిన 12రోజులకు సంబంధించిన కూలి డబ్బులు ఇవ్వటంలేదని వనపర్తి మండలం పెద్దగూడెంతండాకు చెందిన ఉపాధి కూలీలు ప్రజావాణిలో అర్జీని దాఖలు చేశారు. ఎన్నిసార్లు ఫారెస్టు శాఖ కార్యాలయానికి వెళ్లినా స్పందించటంలేదని వాపోయారు. వెంటనే డబ్బులు ఇప్పించాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

4 రోజుల్లో రూ.52.54 కోట్ల వ్యాపారం



- సంక్రాంతి వేళ ఉమ్మడి జిల్లాలో భారీగా మద్యం అమ్మకాలు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో శుభకార్యం అయిన.. పెళ్లి అయిన.. పండుగ అయిన మద్యం ఏరులై పారాల్సిందే. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలతో భారీ ఆదాయమే లభించింది. ఇటీవల నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.40కోట్ల వ్యాపారం జరిగితే.. ప్రస్తుతం సంక్రాంతి సందర్భంగా నాలుగు రోజుల్లో రూ.52.54కోట్ల వ్యాపారం జరిగింది. పండుగకు నాలుగు రోజుల ముందే మద్యం వ్యాపారులు తిమ్మాజిపేట, కొత్తకోట దగ్గర ఉన్న డిపోల నుంచి పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేశారు. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, నారాయణపేటలో 90, నాగర్‌కర్నూల్ జిల్లాలో 67, వనపర్తిలో 37, గద్వాలలో 36 మద్యం దుకాణాలలో మద్యం దుకాణాలుండగా.. అత్యధికంగా జడ్చర్లలో మద్యం అమ్మకాలు జరిగాయి. రెండోస్థానంలో మహబూబ్‌నగర్ ఉండగా.. గద్వాల, కొత్తకోటలోనూ భారీగా అమ్మకాలు జరిగాయి.

తేదీ	ఐఎంఎల్	బీర్లు	ఆదాయం(రూ.ల్లో)
జనవరి13	15,121	15,178	13.92కోట్లు
14	10,824	15,115	10.74కోట్లు
15	17,131	17,056	15.61కోట్లు
16	12,530	17,378	12.27కోట్లు

ఆర్టీసీకి భారీ రాబడి

- సంక్రాంతి రద్దీతో మెరుగైన ఆదాయం
- రెండు రోజుల్లో రూ.3.29 కోట్ల
- తిరుగు ప్రయాణంలో మరింత పెరిగే అవకాశం

స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్రాంతి పండుగ ఆర్టీసీకి బాగా కలిసొచ్చింది. ఈ నెల 12, 13 తేదీల్లో మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో రూ.3.29 కోట్ల ఆదాయం రాబట్టింది. ప్రయాణికుల సౌకర్యార్థం మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ప్రయాణికుల కోసం 360 అదనపు సర్వీసులను నడిపారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాలోని తమ సొంత స్థలాలకు ప్రజలను చేరవేసేందుకు అధికంగా బస్సులు నడిపారు. సెలవులు ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటుంది. 17, 18 తేదీల్లో కూడా మరింతగా ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

- మహబూబ్‌నగర్ రీజియన్‌కు ఈనెల 12వ తేదీన రూ.1,68,75,167 అధిక ఆదాయాన్ని ఆర్జించింది. ఆర్టీసీ సంస్థ, ప్రైవేట్ హైర్ 842 బస్సులు 3,41,861 కిలో మీటర్లు బస్సులు నడవగా ఈ ఆదాయం వచ్చింది. అదే విధంగా 13న రీజియన్‌కు రూ.1,60,24,876 ఆదాయం.. రాగా 341580 కిలోమీటర్లు నడిచాయి. రీజియన్‌లోని పది డిపోల్లో అత్యధికంగా మహబూబ్‌నగర్ డిపో ఈనెల 12వ తేదీన రూ.24,79,485, 13న రూ.22,93,798, వనపర్తి డిపో 12న రూ.23,69,221, 13న రూ.20,15,436 ఆదాయాన్ని పొందాయి.



12, 13 తేదీల్లో డిపోల వారీగా వచ్చిన ఆదాయం (లక్షల్లో)

డిపో	12న ఆదాయం	13న ఆదాయం
మహబూబ్‌నగర్	24,79,485	22,93,798
వనపర్తి	23,69,221	20,15,436
కల్వకుర్తి	19,06,646	19,13.131
గద్వాల	18,19,315	16,97,199
షాద్‌నగర్	18,05,721	19,30,687
అచ్చంపేట	17,48,469	16,28,649
నారాయణపేట	17,33,005	17,62,065
నాగర్‌కర్నూల్	16,35,349	14,59,579
కొల్లాపూర్	12,35,452	12,04,542
కోస్గి	1,42,504	1,19,790

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవ లు అందిస్తుంది. ప్రజలు సంస్థను ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు. సంక్రాంతి పండుగ సందర్భంగా అదనపు సర్వీసులు నడిపించాం. తిరుగు ప్రయాణంలో కూడా నడిపించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి గచ్చిబౌలి వరకు బస్సులు నడుపనున్నాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– శ్రీదేవి, ఆర్ఎం, మహబూబ్‌నగర్

'కంటివెలుగు' ప్రణాళికలు సిద్ధం

వీసీలో కలెక్టర్ యాస్మీన్‌బాషా

వనపర్తి: ఈనెల 19వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మలివిడత కంటివెలుగు కార్యక్రమం నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామనని కలెక్టర్ యాస్మీన్‌బాషా చెప్పారు. సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ హాజరయ్యారు. జిల్లా వివరాలు వెల్లడించారు. వైద్యశిబిరాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8:30కు అన్నిచోట్ల వైద్యశిబిరాలను ప్రారంభించాలన్నారు. క్యాంపులు విజయవంతం అయ్యేందుకు పంచాయతీ కార్యదర్శుల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు, వీఓఏలను భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్, ఏఓ సాయినాథ్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన
వనపర్తి క్రైం: ప్రభుత్వం ఈనెల 18న చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను సోమవారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్‌నగర్, మెట్‌పల్లిలో డీఎంహెచ్ఓ రవిశంకర్ పరిశీలించారు. వారి వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్.సాయినాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహారెడ్డి, సూపర్‌వైజర్ మహేశ్వరచారి, ఆరోగ్య సహాయకులు తిరుపతయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.



మెట్టుపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రవిశంకర్

క్లుప్తంగా

స్వాతంత్ర సమరయోధుడి మృతి

● నివాళులర్పించిన ప్రముఖులు



మల్‌రెడ్డి వెంకట్రావు (ఫైల్)

పెద్దకొత్తపల్లి: కల్వకోలు చెందిన స్వాతంత్ర సమరయోధుడు మల్‌రెడ్డి వెంకట్రావ్(93) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్పీ మనోహర్, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరయోధుడైన మల్‌రెడ్డి వెంకట్రావు మృతి తీరని లోటని అన్నారు.

యువకుడి హఠాన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: కబడ్డీ చూసేందుకు వచ్చిన ఓ యువకుడు ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందిన ఘటన మండలంలోని గన్యాగులలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహేష్ (20) గ్రామంలో జరిగిన కబడ్డీ పోటీలను చూసేందుకు వచ్చి ఆకస్మాత్తుగా కుప్పకూలి కిందపడ్డాడు. వెంటనే గ్రామస్తులు జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కుళ్లిన మృతదేహం లభ్యం

నారాయణపేట రూరల్: పట్టణ శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని ఉన్న ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఆకుల కిషన్ ఆదివారం కట్టెలు తెచ్చేందుకు తమ పొలం వైపు వెళ్లాడు. మార్గమధ్యలో చాకలోని వంపు వద్ద చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ సురేష్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి చూడగా దాదాపు 20రోజుల క్రితమే చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టడానికి రానివిధంగా ఉందన్నారు. అయితే మృతుడి దుస్తుల ఆధారంగా పేరపళ్ల చెందిన ఎల్ల లక్ష్మణ్‌గా గుర్తించామన్నారు. మృతికి గల వివరాలు తెలియలేదని, తండ్రి బస్సప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కోడిపందేల స్థావరంపై దాడి

కొత్తకోట: మండలంలోని పామాపురం శివారులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోడిపందేలా స్థావరంపై జిల్లా ప్రత్యేక పోలీసుల బృందం ఆదివారం దాడి చేసినట్లు ఎస్‌ఐ నాగేశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి నాలుగు కోడిపుంజులు, మూడు సెల్‌ఫోన్లు, రూ.13,980 నగదు, 17 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

కొండేరులో..


ఎర్రవల్లిచౌరస్తా: కోడిపందెం ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై గోకారి కథనం ప్రకారం..ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామ సమీపంలో ఆదివారం కోడి పందెం నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో ఆ స్థావరంపై ఆకస్మికంగా దాడిచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడిలో రూ.10వేల నగదు, రెండు పందెం కోళ్లు, నాలుగు కోడి కత్తులను స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెక్‌డ్యాంలో మొసలి



కోస్గి: మండలంలోని చెన్నారం వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలో సోమవారం మొసలి కనబడింది. అటుగా వెళ్తున్న కొందరు రైతులకు ఇసుక దిబ్బపై మొసలి కనబడటంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలుపగా ఫారెస్ట్ అధికారి జాకీర్, బీట్ అధికారి సంజీవ్ అక్కడికి చేరుకున్నారు. అప్పటికే మొసలి నీటిలోకి వెళ్లిపోయింది.

నేటి నుంచి రంగాపూర్ ఉర్సు



రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా

● నేడు గంధోత్సవం, 18న ఉర్సు
● వారం పాటు నల్లమలలో జాతర సంబరాలు

అచ్చంపేట: జిల్లాలో ప్రసిద్ధి చెందిన జాతర్లలో రంగాపూర్ ఉర్సు ఒకటి. అతిపెద్ద రెండో ఉర్సు నిరంజన్ షావలి దర్గాలో మంగళవారం రాత్రి నుంచి వారం పాటు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. హిందూ ముస్లిం తేడా లేకుండా కొనసాగే ఉర్సుకు జిల్లా నలుమూలల నుంచేగాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఏటా 1.50 లక్షల మందికి పైగా భక్తులు ఉత్సవాలకు హాజరవుతుంటారు. దర్గాను సందర్శిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. కోరిన కోర్కెలు తీరిన భక్తులు కందూరు చేసి మేకలు, గొర్రెలను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. అమ్రాబాద్ మండలం ప్రజలు ఏ శుభకార్యం చేసినా మొదట కొండపై ఉన్న దర్గాను దర్శించుకొని తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

దర్గా చరిత్ర..

సుమారు 600 ఏళ్ల క్రితం అరబ్ దేశాల నుంచి అజ్మీర్‌లో స్థిరపడిన హజ్రత్ ఖాజాగరీబ్ నవాజ్, ఢిల్లీలో స్థిరపడిన నిజామొద్దీన్ ఔలియా శిష్యులు ఇస్లాం మత ప్రచారంలో భాగంగా కాలినడకన తెలంగాణకు వచ్చారని.. వారిలో అయిదుగురు ప్రముఖులున్నారని ముస్లిం పెద్దలు చెబుతుంటారు. అందులో హజ్రత్ నిరంజన్‌షావలి (సయ్యద్ మహమూద్ షాఖాద్రి) రంగాపూర్‌లో, బహోద్దీన్‌షా



నిరంజన్ షావలి సమాధి



బహోద్దీన్‌షా సమాధి

మన్ననూర్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో కొండ మూలమలుపు వద్ద స్థిరపడ్డారని.. వారి మరణాంతరం అక్కడ దర్గాలు నిర్మించారని.. నాటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతవాసులు దర్గాలో ఉర్సు నిర్వహిస్తూ వస్తున్నారు.

ఏర్పాట్లు ఇలా..

17వ తేదీ మంగళవారం రాత్రి గంధోత్సవాన్ని దర్గా తండా, రంగాపూర్ గ్రామపంచాయతీలు, దర్గా కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గంధం మొదటిరోజు దర్గా ఆవరణలో ఖవ్వాలీ, జియారత్ తదితర కార్యక్రమాలతో పాటు వారం పాటు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18న ఉదయం 11 గంటలకు దీపారాధన, 19న ఉదయం 11 గంటలకు జారత్ ఉంటుందని కమిటీ సభ్యులు అమీనోద్దీన్, ఫరీయొద్దీన్, అల్లాజీ తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచులు సక్రీబాయి, లోక్యానాయక్ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక బస్సులు..

నిరంజన్ షావలి ఉర్సు, ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అచ్చంపేట నుంచి రంగాపూర్ వరకు 15 బస్సులు నడుస్తున్నాయి. అచ్చంపేట–రంగాపూర్– ఉమామహేశ్వర కొండపైకి ఆరు మినీ బస్సులు ఉన్నాయి. హైదరాబాద్– అచ్చంపేట, నాగర్‌కర్నూల్–అచ్చంపేట, వనపర్తి, కొల్లాపూర్–అచ్చంపేటకు బస్సులు నడిపిస్తున్నట్లు డీఎం రాజశేఖర్ తెలిపారు.

గంధోత్సవం..

అచ్చంపేటలోని నారాయణప్రసాద్ ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం రాత్రి అచ్చంపేట మహబూబ్‌స్వామి దర్గాతో పాటు మన్ననూర్, అమ్రాబాద్, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, బొమ్మనపల్లి, పెనిమిళ్ల, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి, కొల్లాపూర్, వనపర్తి, మహబుబ్‌నగర్ ప్రాంతాల నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తారు. బొమ్మనపల్లి నుంచి గంధాన్ని గుర్రంపై తీసుకరావడం ప్రత్యేక ఆకర్షణ. గ్రామాల నుంచి బయలుదేరిన గంధాలు అర్ధరాత్రి వరకు రంగాపూర్‌కు చేరుకుంటాయి. అన్ని ప్రాంతాల నుంచి చేరుకోగానే భక్తులు ఉత్సాహంతో నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొంటారు. 18వ తేదీ తెల్లవారుజామున ఉర్సు ప్రారంభమై వారం పాటు కొనసాగుతుంది.

ఉమామహేశ్వర క్షేత్ర సందర్శన..

రంగాపూర్ ఉర్సుకు రెండురోజుల ముందే ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రంగాపూర్‌కు 5 కిలోమీటర్ల దూరంలో కొండపై వెలిసిన ఉమామహేశ్వర క్షేత్రాన్ని ఉర్సుకు వచ్చిన భక్తులు కుల, మత భేదాలు లేకుండా విధిగా దర్శించుకుంటారు.



పార్వతీ పరమేశ్వరల కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్ దంపతులు, ప్రజాప్రతినిధులు

కల్యాణం.. కమనీయం

● కనుల పండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం
● గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రభోత్సవాలు

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశర్వ క్షేత్రం దిగువకొండ భోగ మహేశ్వరంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఏటా మకర సంక్రాంతి పర్వదినం రోజు నుంచి ఉమామహేశ్వర క్షేత్రంలో వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ స్వామి వారికి అలంకరణ వస్త్రాలు సమర్పించారు. ఆదివారం రాత్రి క్షేత్రం నుంచి స్వామివారిని పల్లకీలో దిగువ కొండ భోగమహేశ్వరంకు తీసుకొచ్చారు. అచ్చంపేట భ్రమరాంబ ఆలయంతో పాటు నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల నుంచి బయలుదేరిన ప్రభలు ఆదివారం తెల్లవారుజామున భోగమహేశ్వరం చేరుకున్నాయి. తెల్లవారుజామున ఉమామహేశ్వర క్షేత్రం నుంచి పార్వతీ పరమేశ్వరులను కింద కొండకు తీసుకరావడంతో కల్యాణోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది.

పట్టువస్త్రాల సమర్పణ

ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, అమల దంపతులు పార్వతీ పరమేశ్వరులకు పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం వేద పండితులు వీరయ్యశాస్త్రి, నీలకంఠశాస్త్రి కల్యాణం జరిపించారు. నియోజకవర్గంలోని మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం భక్తులు ఉమామహేశ్వరం క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 9గంటలకు గవ్యాంత పూజలు, వాస్తు పూజ, వాస్తహోమం, రుద్రాభిషేకం, రుద్రహోమం, ప్రాతరౌపాసన, నిత్యబలిహరణ, సాయంత్రం 4గంటలకు సాయమౌపాసన, బలిహరణం, నీరాజనము, మంత్రపుష్పము, నందివాహన సేవ, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు వేద పండితులు నిర్వహించారు.

వైభవంగా ప్రభోత్సవం

అచ్చంపేట భ్రమరాంబ దేవాలయంలో ఆదివారం రాత్రి 8:30 గంటలకు ప్రభ ఉత్సవ కార్యక్రమం ప్రారంభమై సోమవారం తెల్లవారుజామున 3గంటల వరకు పట్టణంలో ఊరేగించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు, భ్రమరాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ పూజల అనంతరం ముస్తాబు అయిన పార్వతీ పరమేశ్వరులను దేవాలయం చుట్టూ నిర్వహించిన ప్రదక్షిణలో పాల్గొన్నారు. లారీపై మిరుమిట్లు కొలిపే విద్యుత్ దీపాలతో అలంకరించిన శేషావాహనంపై పార్వతీ పరమేశ్వరులను ప్రతిష్టించి పూజలు చేశారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా భారీ ఊరేగింపు నిర్వహించారు. ఉమామహేశ్వరం కొండ కింద ఉన్న భోగ మహేశ్వరంకు సోమవారం తెల్లవారుజామున చేరుకుంది. అచ్చంపేట నుంచేకాక రంగాపూర్, మన్ననూర్, అమ్రాబాద్, ఉప్పునుంతల, పదర నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి బయలు దేరిన ప్రభలు అక్కడికి చేరుకున్నాయి. అనంతరం భ్రమరాంబ దేవాలయం నుంచి తీసుకవచ్చిన పార్వతీదేవీ, ఉమామహేశ్వర క్షేత్రం నుంచి తీసుకొచ్చిన స్వామి వార్లకు తెల్లవారుజామున 4 గంటలకు కల్యాణోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు.



అచ్చంపేట భ్రమరాంబ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ రాములు

నేడు ఉమామహేశ్వరంలో..

బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం 9గంటలకు ప్రాతరౌపాసన, బలిహరణము, నీరాజనము, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగము, సాయంత్రం4గంటలకు సాయమౌపాసము, సభాపూజ, బలిహరణము, నీరాజనము, అశ్వవాహనము, మంత్రపుష్పము, తీర్థప్రసాదములుంటాయి.



కల్యాణోత్సవానికి హాజరైన ప్రజలు

నాగర్‌కర్నూల్‌లో భారీ చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం



ఇళ్లను పరిశీలిస్తున్న కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలో ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని మున్నూరుకాపు ఫంక్షన్ హాల్ వెనుక ఉపాధ్యాయుడు మురళీమోహన్ నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12న అత్తగారి ఊరైన ప్రొద్దుటూరుకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి లోనికి ప్రవేశించి రెండు బీరువాల్లో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు, మూడు కిలోల వెండి వస్తువులు, రూ.80 వేల నగదు, రూ.5 వేల విలువైన స్మార్ట్ వాచ్ ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం విరిగి ఉండటంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

కొత్తకోటలో 5 ఇళ్లలో చోరీ

కొత్తకోట: సంక్రాంతి పండుగ సందర్భంగా తాళాలు వేసి ఊర్లకు వెళ్లిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఒకేసారి కొత్తకోట పట్టణంలో ఐదు ఇళ్లలో దొంగతనం జరిగింది. స్థానిక కేపీఎస్ పాఠశాల సమీపంలోని రాజశేఖర్ ఇంట్లో రూ.1200 నగదు, జలేందర్‌రెడ్డి ఇంట్లో 5 తులాల బంగారం, రూ.5 వేలు నగదు, బీమన్న ఇంట్లో 4 తులాల బంగారం, రవిందర్‌రెడ్డి ఇంట్లో రూ.20 వేలు నగదు, రాము ఇంట్లో 4 గ్రాముల బంగారు ఉంగరం, 3 గ్రాముల బంగారు కమ్మలు, రూ.6 వేలు నగదు దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. సీఐ శ్రీనువాస్‌రెడ్డి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సంక్రాంతి వేడుకల్లో అపశృతి

లింగాల: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. రామాలయం చుట్టూ ఆటోతో ప్రదక్షిణ చేస్తుండగా బోల్తా పడింది. ఆ సమయంలో నలుగురు యువకులు ఆటోలో ఉన్నారు. ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడగా వంశీకి కాలు విరిగింది. అంబులెన్సులో వారిని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవాబుపేట: మండలంలోని కూచూర్‌లో అనుమానాస్పదంగా మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తలారి లక్ష్మమ్మ (36) సోమవారం గ్రామ సమీపంలోని ఆకులోనికుంటలో శవమై కనిపించింది. మృతురాలి భర్త నర్సింహులు కొన్ని నెలల క్రితం ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. దీంతో అప్పులు చేశావని భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు అవుతుండేవి. కాగా ఆదివారం సైతం గొడవ పడ్డారని, అనంతరం అందరూ తిని పడుకున్న తరువాత భర్త పొలంలో పంట కాపలకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి తన ఇద్దరి పిల్లలతో కలిసి పడుకున్న మృతురాలు సోమవారం కుంటలో శవమై తేలింది. ఈ సంఘటనలో ఆమె మృతిపై అనుమానాలు ఉన్నట్లు మృతురాలి తల్లి ఎదిరే వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

బాలుడి అదృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: ఇంట్లో పనులు చేయడం లేదని తల్లి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు ఓ బాలుడు. వన్‌టౌన్ ఎస్‌ఐ జగన్నాథం కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని కుమ్మరివాడికి చెందిన లక్ష్మికి ముగ్గురు సంతానం. ఆమె భర్త 15 ఏళ్ల కిందట మృతి చెందడంతో అప్పటి నుంచి కూలీ పనులు చేస్తూ పిల్లలను పెంచుతోంది. అయితే ఈనెల 13న మధ్యాహ్నం ఆమె 16 ఏళ్ల చిన్న కుమారుడు అభిలాష్ చెప్పిన పని చేయడం లేదని తల్లి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించిన ఆచూకీ లభించలేదు. తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇల్లు దగ్ధం: రూ.10లక్షల నష్టం

తెలకపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కాగా, దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించిన సంఘటన తెలకపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. రాకొండకి చెందిన శ్రీనివాసులు నివాసంలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురికావడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కుటుంబసభ్యులు ఇంటి నుంచి బయటకు వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే భారీగా చెలరేగిన మంటలతో ఇంట్లో ఉన్న సామగ్రి, తిండిగింజలు, కొత్త ఇల్లు నిర్మించుకునేందుక తీసుకొచ్చిన నగదు, మొత్తం రూ.10లక్షల వరకు నష్టం సంభవించింది. బాధితుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో 70 గొర్రె పిల్లలు మృతి



మక్తల్: పట్టణ సమీపంలో ఉన్న గుర్లపల్లి రోడ్డు సమీపంలో సోమవారం పట్టణానికి కుర్వ పెద్ద అంజప్ప చెందిన 70 గొర్రె పిల్లలు మృతి చెందాయి. పశువుల పాకలో గొర్రెలు పిల్లలు ఉండగా రెండు కుక్కలు చొరబడి గాయపరచడంతో అవి మృతి చెందాయని బాధితుడు తెలిపాడు.

చింతలకుంట ఆలయానికి పోటెత్తిన భక్తులు

● కోళ్లు, పొట్టేళ్లు బలిచ్చి ప్రత్యేక పూజలు
● పోలీసుల బందోబస్తు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెబ్బేరు: మండలంలోని పాతపల్లి శివారు చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఏటా సంక్రాంతి నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్థానికులేగాకా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో వచ్చి కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పాతపల్లి సర్పంచ్ రవీందర్‌నాయుడు అన్ని ఏర్పాట్లు చేయగా.. గ్రామ యువకులు శ్రీనివాసులు, గోవిందు, రామచంద్రి, రాఘవేందర్, గోవర్ధన్, ఉస్సేన్ తదితరులు వాలంటీర్లుగా పని చేశారు. ఎస్‌ఐ రామస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. తినుబండారాలు, అలంకరణ, ఆట వస్తువులు తదితర దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ పూజారి నంబి వెంకటేశ్వర్లు, ఇతర పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తాగి వేధిస్తున్నాడని ప్రియుడి హత్య

● పాత ప్రియుడితో కలిసి ఘాతుకానికి పాల్పడిన మహిళ

బిజినేపల్లి: తాగి వేధిస్తున్న ప్రియుడిని మరో ప్రియుడితో కలిసి మహిళ హత్య చేసిన సంఘటన సోమవారం తెల్లవారు జామున నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వట్టెం గ్రామానికి చెందిన కృష్ణమ్మకు 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన కొన్నాళ్లకే ఆమెను భర్త వదిలేసి వెళ్లిపోయారు. దీంతో ఆమె కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు వలస వెళ్లింది. అక్కడే ఉంటున్న రవికుమార్ (38)తో పరిచయం ఏర్పడింది. దీంతో వారు ఐదేళ్ల క్రితం అక్కడి నుంచి వచ్చి వట్టెంలో సహజీవనం చేస్తున్నారు. కాగా, కృష్ణమ్మకు గతంలో జడ్చర్లకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తితో సన్నిహితంగా ఉండేది. దీంతో వీరిద్దరి మధ్య అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో రవి రోజూ తాగి వచ్చి ఆమెను వేధించేవాడు. ఆ వేధింపులు తీవ్రం కావడంతో తట్టుకోలేక మాజీ ప్రియుడు శ్రీనివాస్‌కు విషయం చెప్పింది. వారిద్దరూ కలిసి ఆదివారం అర్ధరాత్రి తర్వాత నిద్రలో ఉన్న రవికుమార్‌ను రాయితో తలపై కొట్టి హత్య చేశారు. ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ హన్మంత, ఎస్‌ఐ కృష్ణా ఓబుల్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని, వెంటనే విచారణ చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు చెప్పారు.

పుట్టింటికి వెళ్లొస్తా అన్నందుకు..

● క్షణికావేశంలో భార్యను చంపిన భర్త



చాంద్‌బీ (ఫైల్)

గట్టు: భార్యభర్తల మధ్య చిన్న పాటి గొడవ చిలికిచిలికి గాలి వానలా మారి చివరికి భార్య ప్రాణంగాలిలో కలసిపోయే దాకా వెళ్లింది. వివరాల్లోకి వెళితే.... ఇందువాసికి చెందిన ఎండీ ఖాసీం సోంపురం గ్రామానికి చెందిన చాంద్‌బీ(25)ని పదేళ్ల ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి పుట్టింటికి వెళతానని, తనను పంపించాలని భార్య చాంద్‌బీ భర్తను అడిగింది. ఇప్పుడేందుకు వెళతావని చెప్పడంతో భార్యభర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి.. ఆవేశంలో ఖాసీం భార్యను చున్నీతో గొంతు దగ్గర గట్టిగా బిగించడంతో ఊపిరి ఆడక ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. సోమవారం ఉదయం గ్రామస్తులు విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్, తన సిబ్బందితో ఇందువాసికి చేరుకుని వివరాలను సేకరించారు. భర్తే భార్యను హత్య చేసినట్లుగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతురాలి తండ్రి మదర్‌సాబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గద్వాల సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు కొనసాగనున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

● నిద్రమత్తు, అతివేగమే కారణం



నుజ్జునుజ్జయిన కారు

భూత్పూర్: అతివేగం, ఆపై నిద్రమత్తు కారణంగా కారు డివైడర్‌ను ఢీకొనగా పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాదులోని డీఆర్‌డీఎల్‌లో పనిచేస్తున్న జేడీ.బాబు, అతని భార్య రాజేశ్వరి, కుమారుడు సాయివినేష్ కారులో హైదరాబాద్ నుంచి కోయంబత్తూర్ వెళ్తుండగా భూత్పూర్ మున్సిపాలిటీలోని శేరిపల్లి(బి) సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ముందుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో రోడ్డు మరమ్మత్తు కారణంగా రోడ్డుపై వేసిన డివైడర్‌లను బలంగా ఢీకొట్టింది. దీంతో కారు పల్టీలు కొట్టింది. కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు, ఎల్‌అండ్‌టీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై తమకు వాహనదారుడు ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.


ప్రమాదానికి ముందు కోట్‌పల్లి చెరువులో ఆడుకుంటున్న కుటుంబ సభ్యులు

విషాదం మిగిల్చిన ఈత సరదా

- కోట్‌పల్లి ప్రాజెక్టులో మునిగి నలుగురి మృతి
- వికారాబాద్ జిల్లా ధారూర్‌లో ఘటన

ధారూరు: ఈత సరదా విషాదంగా మారింది. నలుగురు వ్యక్తులు నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. పండుగ వేళ విషాదం నింపిన ఈ ఘటన సోమవారం వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కోట్‌పల్లిలో చోటుచేసుకుంది. సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. పూడూర్ మండలం మన్నెగూడకు చెందిన బాయికని పెంటయ్య కుమారులు లోకేశ్ (28), వెంకటేశ్(25), వీరి బాబాయి బుచ్చయ్య కొడుకు జగదీశ్(24), మేనత్త కొడుకు రాజేశ్ (24).. తమ కుటుంబ సభ్యులైన మరో 9 మందితో కలసి కోట్‌పల్లి ప్రాజెక్టుకు వచ్చారు. అక్కడి పరిసరాలను, అడవి అందాలను వీక్షించారు. అనంతరం సేదతీరేందుకు నీటి ఒడ్డుకు చేరుకున్నారు. అందరూ సరదాగా మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తున్న సమయంలో ఈత వచ్చిన లోకేశ్, జగదీశ్ నీటిలోకి దిగారు. వీరిని చూసి వెంకటేశ్, రాజేశ్ కూడా నడుములోతు వరకు వెళ్లి నీటిలో ఆడుకోవడం ప్రారంభించారు. కాగా, లోకేశ్, జగదీశ్ జలాశయంలో కొద్ది దూరంలో ఉన్న బండరాయి వద్దకు వెళ్లి వెనుదిరుగుతున్న సమయంలో ఈతరాని వెంకటేశ్, రాజేశ్‌లు వీరికి ఎదు రుగా వెళ్లేందుకు ప్రయత్నించి నీటిలో మునిగారు. వీరిని కాపాడేందుకు లోకేశ్, జగదీశ్‌లు ఒక్కొక్కరిని పట్టుకున్నారు. అయితే ఆందోళనకు గురైన వెంకటేశ్, రాజేశ్ వారిని గట్టిగా పట్టుకుని ఈత కొట్టే వీలులేకుండా చేశారు. దీంతో నలుగురూ నీటిలో మునిగిపోయారు. దీంతో ఒడ్డున ఉన్న ఇతర కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించి గట్టిగా కేకలు వేయడంతో కొద్ది దూరంలో ఉన్న బోటింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని నీటిలో మునిగిన వారి కోసం గాలించారు. అయితే అప్పటికే వారు మరణించడంతో మృతదేహాలను బయటకు తీశారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బుచ్చయ్య కొడుకు జగదీశ్ స్వగ్రామంలోనే వ్యవసాయం చేస్తున్నాడు. లోకేశ్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వెంకటేశ్, రాజేశ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. లోకేశ్, వెంకటేశ్, రాజేశ్ తమ కుటుంబాలతో హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. సంక్రాంతి పండుగ కోసం వీరంతా సొంతూరు మన్నెగూడకు వచ్చారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ | పదోన్నతులకూ ఓకే

సంక్రాంతి వేళ సర్కారీ ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపి కబురు

- రెండు రోజుల్లో షెడ్యూల్
- ఏప్రిల్ తర్వాతే జాయినింగ్
- మంత్రి సబిత ప్రకటన
- టీచర్ల సంఘాల్లో ఆనందం



సాక్షి, హైదరాబాద్: పదోన్నతులు, బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మంగళ, బుధవారాల్లో ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదలవుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆశిస్తున్నారు. విధి విధానాలు ఎలా ఉంటాయని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మంత్రులు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి ఆదివారం ఆయా సంఘాల నేతలతో సమాలోచనలు జరిపారు. అనంతరం బదిలీలు, పదోన్నతులకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారని, త్వరలోనే షెడ్యూల్ విడుదల చేస్తామని సబిత తెలిపారు. కస్తూరీ బా గాంధీ బాలికల విద్యాలయంలో కూడా ఇది అమలవుతుందని ఆమె చెప్పారు. సంక్రాంతి కానుకగా ఈ శుభవార్త చెబుతున్నట్టు ఆమె పేర్కొన్నారు. టెన్త్ పరీక్షల షెడ్యూల్ ప్రకటించడం... ఇతర తరగతుల పరీక్షలు త్వరలో జరుగుతున్న కారణంగా ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు ప్రకటించినా, ఏప్రిల్ తర్వాతే వీటిని అమలు చేస్తామని తెలిపారు. అయితే ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను ఫిబ్రవరి రెండో వారం కల్లా పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

ప్రమోషన్లు ఎంతమందికి?

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 1.05 లక్షల మంది ఉపాధ్యాయులున్నారు. వీటిల్లో 18 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం 12 వేల పోస్టులే ఖాళీగా ఉన్నాయని అసెంబ్లీలో తెలిపింది. 317 జీవో అమలు తర్వాత దీనిపై స్పష్టమైన లెక్కలు తీయాల్సి ఉంది. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 7111 ఖాళీలున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ)లకు పదోన్నతులు కల్పించడం ద్వారా 70 శాతం ఖాళీలు భర్తీ చేస్తారు. మిగిలిన 30 శాతం డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. ఈ క్రమంలో 5 వేల మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి లభిస్తుంది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ పోస్టులు 2084 ఖాళీలున్నాయి. వీటిని ఎస్‌జీటీల ద్వారా భర్తీ చేస్తారు. ఉన్నత పాఠశాలల్లో 1948 పోస్టులు ఖాళీ ఉన్నాయి. వీటిని ప్రస్తుతం ఉన్న స్కూల్ అసిస్టెంట్స్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 9 వేల మందికిపై ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లభిస్తాయి.

కోర్టు వివాదాల తర్వాతే ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోల భర్తీ

మండల విద్యాశాఖాధికారులు, డిప్యూటీ జిల్లా విద్యాశాఖాధికారులు, భాషా పండితుల అప్‌గ్రేడ్ వ్యవహారం చేపట్టేందుకు ప్రభుత్వం సాహసించడం లేదు. రాష్ట్రంలో 443 ఎంఈవో పోస్టులున్నాయి. కానీ ఇప్పుడు పనిచేస్తున్న ఎంఈవోలు 21 మంది మాత్రమే. డిప్యూటీ డీఈవో పోస్టులు 78 ఉంటే 18 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఎంఈవో పోస్టులను నేరుగా ఎంపికైన ప్రభుత్వ హెచ్‌ఎంల ద్వారానే భర్తీ చేయాలని ప్రభుత్వ టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక సంస్థల పాఠశాలలకూ ఈ అవకాశం ఇవ్వాలని మరికొన్ని సంఘాలు పట్టుబడుతున్నాయి. ప్రస్తుతం వివాదం కోర్టు పరిధిలో ఉంది. భాషా పండితుల విషయం కూడా న్యాయస్థానంలో ఉంది. ఈ కారణంగా కోర్టు వివాదం ముగిసిన తర్వాతే ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఎన్నికల కోసమేనా?

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మార్చిలో ఈ ఎన్నిక జరిగే వీలుంది. మరోవైపు సాధారణ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే 317 జీవో కారణంగా ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. 2015లో ప్రమోషన్లు, బదిలీలు చేపట్టారు. 2017లో మరోసారి బదిలీలు మాత్రమే జరిగాయి. అప్పట్నుంచి బదిలీలు, పదోన్నతులు లేవు. ఈ ప్రభావం ఎమ్మెల్సీ, సాధారణ ఎన్నికలపై ఉంటుందని ప్రభుత్వం సందేహిస్తోందని, అందుకే హడావుడిగా ఉపాధ్యాయవర్గాలను ఆకర్షించేందుకు ప్రకటన చేశారని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. 317 జీవో కారణంగా జరిగిన బదిలీల్లో 13 జిల్లాల్లో స్పౌజ్ కేసులను పరిష్కరించలేదని, ఇప్పుడు బదిలీలు ఎలా చేపడతారని మరికొంతమంది అంటున్నారు.

ఖాళీలన్నీ భర్తీ చేయాలి

బదిలీలు, పదోన్నతులు ఇవ్వాలనే నిర్ణయం మంచిదే. దీంతో పాటు స్కూళ్ళలో అన్ని స్థాయి ల్లో ఖాళీలు భర్తీ చేయాలి.. అప్పుడే విద్యా వ్యవస్థలో మార్పు సాధ్యం. ఎంఈవో, డిప్యూటీ డీఈవో వంటి పర్యవేక్షక పోస్టులను విస్మరించకూడదు.
– పి రాజభాను చంద్ర ప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు

మంచి నిర్ణయం

ఉపాధ్యాయ సంఘాలకు ఈ తరహా తీపి కబురు ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఈ ప్రక్రియ పూర్తి చేయాలనే నిర్ణయం సమర్థనీయం.
– చీరెల్లి కమలాకర్, పింగిలి శ్రీపాల్ రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్ నేతలు)

తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లిస్తారు

వైద్యులు, మెడికల్ షాపుల యజమానులను హెచ్చరించిన మావోయిస్టులు

చర్ల: భద్రాచలంతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రా ప్రాంతాల్లోని గిరిజన, గిరిజనేతర పేదల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, ల్యాబ్‌లు, మెడికల్ షాపుల యజమానులు ఇకనైనా తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో మూల్యం చెల్లించక తప్పదని మావోయిస్టు పార్టీ హెచ్చరించింది. ఈ మేరకు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ సోమవారం లేఖ విడుదల చేశారు. భద్రాచలంలోని ఆస్పత్రులు మాఫియాకు అడ్డాగా మారగా, గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సంపాదనే ధ్యేయంగా వైద్యులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని బూచిగా చూపి వైద్యం పేరుతో రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఉంచి అవసరం లేకున్నా రకరకాల పరీక్షలు, చికిత్స చేస్తూ డబ్బు కోసం హింసిస్తున్నారని ఆరోపించారు. ఇంకోపక్క భద్రాచలం ప్రభుత్వ వైద్యశాల వైద్యులు సైతం సొంత క్లినిక్‌లకే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ పేదలను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా వైద్యులు, ల్యాబ్‌లు, మెడికల్ షాపుల యజమానులు పద్ధతి మార్చుకోవాలని ఆజాద్ లేఖలో హెచ్చరించారు.

కాపాడేవాడే కడతేర్చాడు

- భార్య, కుమార్తె, తల్లిని చంపి.. తాను ఆత్మహత్య
- హైదరాబాద్‌లోని తార్నాకలో ఓ ప్రైవేట్ ఉద్యోగి ఘాతుకం
- చెన్నై వెళ్లేందుకు కుటుంబం నిరాకరించడంతో దారుణం


భార్య సింధూరతో ప్రతాప్


చిన్నారి ఆద్య

సాక్షి, హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఘోరం జరిగింది. తనతో చెన్నై రావడానికి నిరాకరించిన భార్యతో పాటు కుమార్తెను, కన్నతల్లిని చంపేశాడు. ఆపై తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు ఓ ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం మధ్యాహ్నం ఈ విషాద ఉదంతం వెలుగులోకి వచ్చింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. చెన్నైకి చెందిన ప్రతాప్ (34) అక్కడి ఓ కార్ల కంపెనీలో డిజైన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు దాదాపు ఎనిమిదేళ్ల క్రితం తార్నాక ప్రాంతానికి చెందిన సింధూర (32)తో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఆద్య ఉంది. సింధూరకు రెండు నెలల క్రితం హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమెతో పాటు ఆద్య, ప్రతాప్ తల్లి రాజతి నగరానికి వచ్చారు. తార్నాకలోని రూపాలీ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నారు. చెన్నైలోనే ఉద్యోగం చేస్తున్న ప్రతాప్ వారాంతాల్లో ఇక్కడికి వచ్చి వెళ్తుండేవాడు. చెన్నై వెళదామనే విషయంపై కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

బెడ్రూంల్లో నిద్రిస్తుండగా..

చెన్నైలో స్థిరపడటానికి ఉద్యోగం వదిలి రావాలంటూ భార్య సింధూరపై ప్రతాప్ ఒత్తిడి తెస్తున్నాడు. దీనికి ఆమె అంగీకరించడంపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదాలు, గొడవలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ వీకెండ్‌లో రావడంతో శుక్రవారం ప్రతాప్ నగరానికి వచ్చాడు. చెన్నై వెళ్లే విషయమై రెండు రోజులుగా వీరి మధ్య గొడవలు జరిగి ఆదివారం రాత్రి తారస్థాయికి చేరింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ప్రతాప్.. కుటుంబాన్ని హతమార్చి తానూ తనువు చాలించాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున ప్రధాన బెడ్రూంలో నిద్రిస్తున్న భార్య, కుమార్తెను, కొద్దిసేపటి తర్వాత పక్కనే మరో బెడ్రూంలో పడుకుని ఉన్న తల్లినీ చంపివేశాడు. హాల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సింధూర సహోద్యోగులు ఫోన్ చేయడంతో..

సింధూర సోమవారం విధులకు హాజరుకావాల్సి ఉంది. ఆమె బ్యాంక్‌కు రాకపోవడంతో ఆరా తీసేందుకు సహోద్యోగులు ఫోన్ చేశారు. సింధూర నుంచి స్పందన రాకపోవడంతో మధ్యాహ్నం వరకు ప్రయత్నించారు. చివరకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో సింధూర అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. ఎంత పిలిచినా లోపల నుంచి స్పందన లేకపోవడంతో పక్కన అపార్ట్‌మెంట్‌లో నివసించే సింధూర తల్లి జమునను తీసుకువచ్చారు. వీరికి ఫ్లాట్‌లోకి హాల్‌లో ఫ్యాన్‌కు వేలాడుతున్న ప్రతాప్ మృతదేహం కనిపించింది. బెడ్స్‌పై ఉన్న సింధూర, ఆద్యలను పరిశీలించారు. సింధూర కొన ఊపిరితో ఉండటంతో సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించి డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స ప్రారంభించడానికి ముందే ఆమె తుది శ్వాస విడిచింది. నలుగురి మృతదేహాలను పోస్టుమార్టం పరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించారు. సింధూర తల్లి జమున ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు: సింధూర తల్లి జమున



'ప్రతాప్ మాకు దగ్గరి బంధువు హైదరాబాద్ నుంచి చెన్నై షిఫ్ట్ కావాలనే విషయంపై భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నాయి. కానీ.. ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదు' అని జమున మీడియాతో అన్నారు. రాజతి మెడపై ఉన్న గుర్తుల్ని బట్టి ఉరి బిగించి లేదా గొంతు నులిమి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. సింధూర, ఆద్యల మృతికి కారణాన్ని స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. పోస్టుమార్టం పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక నివేదిక వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వస్తుందని ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ తెలిపారు. ఈ కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సింధూర కోసం వాళ్ల ఆఫీస్ వారు వచ్చి చూసేదాకా ఇంతటి ఘోరం జరిగిందని నాకు తెలియదు. ఆమె ఫోన్ ఎత్తట్లేదు అని ప్రతాప్ కూడా స్పందించట్లేదని కంగారు పడుతూ వచ్చి చెప్పారు. ఎంత కొట్టినా తలుపులు కూడా తీయట్లేదని ఆందోళన చెందారు. అప్పుడు వచ్చి చూస్తే ఈ ఘోరం కనిపించింది. మేం పక్క అపార్ట్‌మెంట్లో ఉంటాం. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే మా దగ్గరికి వస్తే సరిపోయేది కదా. ఇంత ఘోరం జరిగి ఉండేది కాదు కదా.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడులో జలాశయంలో సోమవారం నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాలువ ద్వారా సాగు నీటి అవసరాల కోసం 100 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

గ్యాస్ లీకై.. ఐస్ ఫ్యాక్టరీలో పేలుడు



ఎర్రవల్లిచౌరస్తా: అమ్మోనియం గ్యాస్ లీకై ఐస్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఇటిక్యాల మండలం బీచుపల్లి సమీపంలోని తిమ్మాపురం రోడ్డులో ఉన్న ఐస్ ఫ్యాక్టరీలో ఆదివారం ఉదయం అమ్మోనియం గ్యాస్ లీక్ కావడంతో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ప్రమాద సమయంలో విధులు నిర్వహిస్తున్న గోపాల్, దర్వేంద్ర, రాములుకు గాయాలు కాగా మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. పేలుడు శబ్దంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సుమారు రూ. 20లక్షల వరకు ఆస్తినష్టం వాటిలినట్లు బాధితుడు బాబు వాపోయాడు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఆత్మకూర్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపురం చెందిన మహిమూద్ (46) ఆదివారం రాత్రి పరమేశ్వరస్వామి చెరువు వద్దకు చేపల వేటకు వెళ్లాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లి రైతులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారని, సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్‌గౌడ్ తెలిపారు.

వివాదాస్పదం.. టోల్ వ్యవహారం


మున్ననూర్ టోల్‌గేట్ దగ్గర ఆందోళన చేస్తున్న వినియోగదారులు(ఫైల్)

- వినియోగదారులపై టోల్ సిబ్బంది దాడి
- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిక

జడ్చర్ల: జాతీయ రహదారులపై వాహనాలు ప్రయాణించే సమయంలో నిర్దేశిత రుసుము వసూలు చేసే టోల్‌గేట్ నిర్వాహకులు వినియోగదారులపై గౌరవంగా వ్యవహరించడంతో పాటు వారి భద్రతకు కృషి చేయాల్సి ఉంది. అందుకు భిన్నంగా వినియోగదారులపై దాడులకు పాల్పడిన సంఘటన 167 నంబర్ జాతీయ రహదారిపై మిడ్జిల్ మండలం మున్ననూర్ దగ్గర ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద ఆదివారం చోటు చేసుకుంది. టోల్ నిర్వాహకులు గతంలో కూడా పలు సందర్భాలలో వ్యవహరించిన తీరు వివాదస్పదంగా మారింది. రోడ్డు భద్రత, పర్యవేక్షణను గాలికొదలేసిన టోల్ నిర్వాహకులు కేవలం ధనార్జనపైనే దృష్టి సారించారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఈకోవలోనే సాంకేతిక లోపాలు చూపుతు విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు వెళ్లకున్నా పలుసార్లు టోల్ రుసుము వసూలు చేసిన సందర్భాలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఆ ఫిర్యాదులు ఇంకా కొనసాగుతుండగానే వినియోగదారులతో అసభ్య, అవమాన ప్రవర్తనతో వ్యవహరించడమే గాక ఏకంగా దాడులకు పాల్పడుతుండడంపై వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.


వినియోగదారులపై దాడి చేస్తున్న సిబ్బంది


బాదేపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు జోసెఫ్‌రెడ్డి

గట్టిగా నిలదీసినందుకే..

తమ వాహనాలకు సంబంధించి పలుసార్లు టోల్ వైపు రాకున్నా ఫాస్టాగ్ నుంచి టోల్ రుసుము కట్ అయ్యాయని గట్టిగా నిలదీయడంతోనే టోల్ నిర్వాహకులు వ్యూహాత్మకంగా దాడులకు దిగారని బాధితులు జోసఫ్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, జే.జోసఫ్ తెలిపారు. చిల్వేరు నుంచి మిడ్జిల్ వెళ్తున్న సమయంలో ఈ విషయమై నిలదీశామని, అనంతరం తిరిగి మిడ్జిల్ నుంచి చిల్వేరుకు వెళ్తున్న సమయంలో తమ వాహనాన్ని గమనించి దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. ఒక్కసారిగా టోల్ సిబ్బంది తమపై చేయి చేసుకోవడంతో తీవ్ర గాయాలకు గురయ్యామని తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు

టోల్ సిబ్బంది తమపై అకారణంగా దాడి చేశారని మిడ్జిల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దాడిలో గాయపడిన వారు బాదేపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో జోసెఫ్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉందని బాధిత బంధువులు తెలిపారు.

ప్రశ్నిస్తే దాడి చేశారు..



టోల్‌గేట్ వ్యవహారం సంబంధించి తమ వాహనాలు వెళ్లకున్నా ఫాస్టాగ్ రుసుము వసూలు చేయడంపై గట్టిగా ప్రశ్నించినందుకే తమపై టోల్ గేట్ సిబ్బంది దాడి చేశారు. తమను బండబూతులు తిడుతూ కొట్టారు. వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి.
– ప్రణీత్‌రెడ్డి, బాధితుడు, చిల్వేరు

కాలర్ పట్టుకున్నారు..

కారు టోల్‌గేట్ గుండా వెళ్లకుండా పక్కన ఉన్న మరో గేటు గుండా వెళ్తుండగా తమ సిబ్బంది అడ్డుకున్నారు. ఆ సమయంలో ఇరువురి మధ్య మాటామాట పెరిగింది. దీంతో తమ సిబ్బందిలో ఒకరి కాలరు పట్టుకోవడంతో గొడవ చోటు చేసుకుంది.
–సంతోష్, టోల్‌గేట్ ఇన్‌చార్జ్, మున్ననూర్

ఆది నుంచి వివాదాస్పదమే

ఇక్కడ టోల్‌గేట్ వ్యవహారం ఆది నుంచి వివాదాస్పదంగానే ఉందని వినియోగదారులు తెలిపారు. టోల్‌గేటు నిర్మాణ సమయంలోనే నాసిరకమైన పనులు చేపట్టడంతో గాలివాన దుమారానికి టోల్‌గేటు కూలి ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన అప్పట్లో సంచలనంగా మారింది. తదుపరి టోల్‌గేట్ నిర్వహణ సందర్భంగా వాహనాల రాకపోకలకు ఆరు గేట్లు ఏర్పాటు చేసినా అటు ఇటుగా ఒక్కోటి చొప్పన రెండు గేట్లను మాత్రమే వినియోగిస్తారు. ఇక పేరుకే ఫాస్టాగ్ ఉందని, వాహనాల రాకపోకల సమయంలో పనిచేయక పోవడంతో చాలా సందర్భాలలో ఆలస్యం చోటు చేసుకుంటుంది. బైక్‌లు, ట్రాక్టర్లు, ఆటోలు వెళ్లేందుకు రోడ్డుపై అడ్డుగా బారికేడ్లు ఉంచడంతో చిట్టచివర ఓ పక్కగా ఉన్న గుంతల గుండా వెళ్లాల్సి వస్తుంది. ఫిర్యాదు చేద్దామంటే కనీసం టోల్‌గేట్ అధికారులు, నిర్వాహకుల సమాచారం, ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల విభాగం లేవు.

కేసీఆర్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు


అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారి దర్శనానికి వెళ్తున్న ఎంపీ ధర్మపురి అరవింద్

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్
- జోగుళాంబ ఆలయంలో పూజలు

అలంపూర్: సీఎం కేసీఆర్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అర్చక స్వాములతో కలిసి స్వాగతం పలికారు. ఎంపీ జోగుళాంబ అమ్మవారిని, బాలబ్రహ్మేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జోగుళాంబ గద్వాల జిల్లాకు రావడం తొలిసారి అని తెలిపారు. ఈ ప్రాంతంలో వెలిసిన జోగుళాంబ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వందల సంవత్సరాల క్రితం ఇక్కడి ముస్లిం రాజులు దండయాత్ర చేసి ఆలయాలను, విగ్రహాలను ధ్వంసం చేసినట్లు అర్చక స్వాములు వివరించినట్లు తెలిపారు. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జోగుళాంబ అమ్మవారిని పునఃప్రతిష్ఠించినట్లు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం ద్వారా రూ.72 కోట్లు మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందులో సగం నిధులను మాత్రమే వాడుకుని మిగిలినవి నిరుపయోగంగా వదిలేసిందన్నారు. కృష్ణ పుష్కరాలకు వచ్చిన సీఎం కేసీఆర్ ఈ ప్రాంతానికి వివిధ పనులకు రూ.100 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ఒక్క పైసా మంజూరు చేయలేదన్నారు. ఎమ్మెల్సీ కవిత విలేకరుల సమావేశంలో నిజామాబాద్‌లో మందిరాలకు రూ.2 కోట్లు, చర్చీలకు రూ.4 కోట్లు, మసీదులకు రూ.8 కోట్లు ఇచ్చినట్లు చెప్పారన్నారు. కవిత తెలిసి మాట్లాడిందో తెలియక మాట్లాడిందో అర్థం కాలేదన్నారు. రాష్ట్రంలో హిందువుల జనాభా ఎంత, ముస్లిం, క్రిస్టియన్ జనాభా ఎంతా అని ప్రశ్నించారు. వాళ్లది ఓటు బ్యాంకు రాజకీయం తప్ప మరొకటి లేదన్నారు. ఈ సారి వచ్చే ఎన్నికల అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని కాషాయ స్థాపనకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాగమద్దిలేటి, ఈశ్వరయ్య, నరేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

హరీశ్‌రావు ఆడిట్ రిపోర్ట్ అబద్ధం

కొత్తకోట: రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఇస్తున్న ఆడిట్ రిపోర్ట్ అంతా అబద్ధమని ఎంపీ అరవింద్ విమర్శించారు. సోమవారం ఆయన పట్టణంలోని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం రూ.10 వేల కోట్లు, 2021–22లో 60 శాతం తగ్గించి రూ.4,900 కోట్లు ఖర్చు పెట్టినట్లు కాగితాల్లో చూపిస్తున్న రిపోర్టు అంతా దగా అని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం విషయంలో కేవలం 20 శాతం మాత్రమే పూర్తి అయ్యాయని, అందులో సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాలకే కేటాయించినట్లు తెలిపారు. ఆడిట్ రిపోర్టులు అంతా గందరగోళంగా ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీలో చేరితే ఆత్మహత్య చేసుకున్నట్లే అని హరీష్‌రావు మాట్లాడంపై మండిపడ్డారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయని, మనిషి పుట్టుక పుట్టి ఉంటే హరీష్‌రావు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో దేవరకద్ర, వనపర్తి నియోజకవర్గాలు బీజేపీ ఖాతాల్లో ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


గర్భగుడిలో వెలిసిన రామలింగేశ్వరస్వామి

ముగిసిన ఎత్తం గట్టు బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండలంలోని ఎత్తం గట్టుపై కొలువుదీరిన రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుడు మురళీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 1,400 అడుగుల ఎత్తులో ఎత్తం గట్టుపై వెలిసిన రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారి వద్దకు వెళ్లేందుకు బండరాళ్లను తాకుతూ భక్తులు చేరుకున్నారు. ఈనెల 14నుంచి భక్తులు స్వామివారికి వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు స్వామివారి వద్దకు చిన్న పిల్లలను తీసుకువచ్చి తలనీలాలు సమర్పించారు. స్వామివారి వద్దకు వెళ్లలేని భక్తులు ముఖద్వారం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద దర్శనం చేసుకొని గట్టుపైకి వెళ్లారు.


బండరాళ్లపై వెళ్తున్న భక్తులు